ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
3
గురువారం 12 జూన్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

12-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	34	26
తెనాలి	35	26
నరసరావుపేట	32	25
బాపట్ల	35	27
రెంటచింతల	31	26
చీరాల	35	27



- నేటి నుంచి బడులు పునః ప్రారంభం
- విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీకి కార్యాచరణ
- సన్న బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం
- కొలిక్కివస్తోన్న బదిలీలు.. తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- 20న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం

గణ.. గణ..



గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి.. వాతావరణం చల్లబడింది.. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆట పాటల్లో ఇంతకాలం సందడి చేసిన విద్యార్థులు బడికి బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు నెలా 45 రోజుల తర్వాత పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఇందుకు అను గుణంగా పాఠశాలల్ని ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. పునః ప్రారంభం తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన తరగతులను విద్యాశాఖ నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేలా నూతన ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా అనేక నూతన సంస్క



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలు

రణలు ఈ ఏడాది నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, టై, బ్యాగుతో కూడిన కిట్లు పాఠశాలలకు చేరుకున్నాయి. వాటిని గురువారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాలల్లో కొరత లేకుండా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బదిలీల ప్రక్రియ తుది దశకు రావడంతో మరో వారంలో పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు రానున్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు ఈ నెల 20న పాఠశాలల్లో మెగా పేటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్) నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు రానున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతోనే భోజనం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పాఠశాలలకు సన్న బియ్యం తరలించినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. కూరలతో పాటు మెనూలో మార్పులు రానున్నాయి. తల్లికి వందనం కార్యక్రమాన్ని కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది.

రుణ లక్ష్యాలు.. ఖరారు

- రంగాల వారీగా సిద్ధం చేసిన లీడ్‌బ్యాంక్
- ఎంఎస్ఎంఈ లక్ష్యం రూ.18,043.49 కోట్లు
- విద్యకు రూ.342.98 కోట్లు..
- గృహ రుణాలు రూ.1,217.78 కోట్లు

రూ. 19,604.25 కోట్లతో ప్రణాళిక



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.19,604.25 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ సిద్ధం చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు విద్య, గృహ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. ఆయా రంగాలకు సంబంధించి ఆర్థిక సహాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రాయితీ రుణాలు కూడా అందజేస్తున్నాయి. సదరు సంస్థలకు అందజేసే రుణాల ద్వారా కార్యకలాపాలను విస్తరించడానికి, కొత్త ఆవిష్కరణలకు రుణాలు దోహద పడతాయి. సకాలంలో రుణాలు అందక సదరు సంస్థల నిర్వాహకులు ఆర్థికంగా ఇక్కట్లు పడుతు న్నారు. ఈ పరిస్థితుల్లో ఎం ఎస్ఎంఈలను గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో స్థాపించడానికి, ప్రోత్సహించేందుకు రాయితీ రుణాలను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా విద్యా రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచించింది. విద్యా రుణాలు పల్నాడు జిల్లాలో 3777, గుంటూరు జిల్లాలో 11,288, బాపట్ల జిల్లాలో 4,971 విద్యార్థులకు రుణాలు ఇచ్చేందుకు లీడ్‌బ్యాంకు లక్ష్యాలు నిర్దేశించింది.

జిల్లాల వారీగా రుణ ప్రణాళిక ఇలా ఉంది

జిల్లా	ఎంఎస్ఎంఈ రుణాలు (కోట్లలో..)	విద్య రుణాలు (కోట్లలో..)	గృహ రుణాలు (కోట్లలో..)
పల్నాడు	2,604.99	74	293.34
బాపట్ల	1,291.50	70.29	184.50
గుంటూరు	14,147	198.69	739.94

క్యాటగిరీలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా రుణ లక్ష్యాలు ఖరారయ్యాయి. 2025- 26కు సంబంధించి లక్ష్యాలను లీడ్‌బ్యాంక్ నిర్దేశించింది. బ్యాంకుల వారీగా రుణాలకు సంబంధించి టార్గెట్లను ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో ఆయా రంగాలలో రూ.19,604.25 కోట్ల రుణాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా లబ్దిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించ నున్నారు. విద్య, గృహ రుణాలకు పెద్ద పీట వేయనున్నారు. విద్యకు సంబం ధించి 20,036 మంది విద్యార్థులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు లక్ష్యాలు ఇచ్చారు. లక్ష్యాల మేర రుణాల పంపిణీ చేస్తే ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. వివిధ రంగాలకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు(ఎంఎస్ఎంఈ)లకు భారీగా రుణాలు పంపిణీ చేయనున్నారు.

ఆచరణ శూన్యం

ఏటా రుణ ప్రణాళిక ఘనంగా ఉన్నా ఆచరణ శూన్యంగా ఉంటుందన్న విమర్శలున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎటువంటి హామీ లేకుండా కొన్ని రకాల రుణాలను మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేసినా వాటిని బ్యాంకులు పట్టించుకోవడంలేదు. తీసుకున్న రుణానికి తగిన విధంగా ష్యూరిటీ ఇస్తేనే రుణం మంజూరు చేసే పరిస్థితి నెలకొంది. విద్యా రుణాలకు కూడా బ్యాంకులు ఆస్తులను హామీగా తనఖా పెట్టించుకుంటున్నాయి. బ్యాంకర్ల తీరుపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. గత ఏడాది ప్రకటించిన ప్రణాళికలో నామమాత్రంగా కూడా రుణాలను బ్యాంకులు మంజూరు చేయలేదని లెక్కలు తెలియజేస్తున్నాయి. రుణ ప్రణాళిక ప్రకటించడం.. బ్యాంకులకు లక్ష్యాలు ఇవ్వడంతో తమ పని అయిపోయిందని లీడ్ బ్యాంకులు భావిస్తున్నాయి. ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయా లేదా అన్న అంశంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా పోయింది.



నేడు.. ఏడాది విజయోత్సవాలు

వేడుకలకు కూటమి శ్రేణులు సిద్ధం ● బైక్‌ర్యాలీలు.. కేక్ కటింగ్‌లకు ఏర్పాట్లు

- అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల అరాచకం.. అకృత్యాలతో.. అల్లాడిన ఓటర్లు పోటెత్తడంతో వైసీపీ పాలన అంతమై కూటమి అధికారం చేపట్టి గురువారంతో ఏడాది అవుతుంది. గత ఏడాది జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగ్గా.. అదే నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనా పగ్గాలు చేపట్టింది. నాడు పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరగ్గా.. అది గురువారానికి ఏడాది అవుతుంది. ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించే వేడుకల్లో ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో విజయోత్సవాలకు కూటమి శ్రేణులు సిద్ధమయ్యారు. గురువారం అన్ని నియోజకవర్గాల్లో ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా కూటమి శ్రేణులు జరుపుకోనున్నాయి. ఇందుకోసం అన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. యువత ఆధ్వర్యంలో పట్టణాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నారు. కేక్ కటింగ్‌లతో పాటు బాణసంచా పెద్దఎత్తున కాల్చేందుకు శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రదర్శనలతో పాటు సంబరాలను జయప్రదం చేయాలని కూటమి నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏడాది విజయోత్సవ సంబరాల ద్వారా ప్రజలకు నేతలు వివరించనున్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గాల్లో కూటమి నేతృ త్వంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయనున్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

- ప్రత్యేక పాఠశాలలతో మెరుగైన విద్య
- గురుకులం ప్రారంభోత్సవంలో మంత్రి సంధ్యారాణి

నరసరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. నరసరావుపేట మండలం పెదతురకపాలెంలో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలతో పాటు గ్రామంలో రూ. కోటితో నిర్మించిన సీసీ రోడ్డును గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజనుల నివాస ప్రాంతాల్లో నూతనంగా పాఠశాలలు ఏర్పాటు చేసి గిరిజన విద్యార్థులకు మెరుగైన బోధన, వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామ న్నారు. నాణ్యమైన విద్య అందించి గిరిజన విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపరచాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన ఉత్పత్తులు విక్రయించుకునేందుకు రూ.7 కోట్లతో గిరిజన బజార్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.



గిరిజన పాఠశాలను ప్రారంభిస్తున్న మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ అరవిందబాబు

తండాలకు సోలార్ విద్యుత్ : మంత్రి గొట్టిపాటి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా కొన్ని గిరిజన ప్రాంతాల్లో నేటికీ విద్యుత్ సౌకర్యం లేదని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అభయారణ్యాల్లోని తండాలకు సోలార్ ద్వారా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

150 మందికి ఉచిత విద్య

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

జిల్లాలోని 150 మంది గిరిజన పేద విద్యార్థులకు తమ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచితంగా విద్యను అందిస్తున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. గ్రామస్థుల వినతితో పెదతురకపాలెంలోని పాఠశాల ప్రహరీకి ఎంపీ రూ.50 లక్షలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిం దబాబు మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్య ద్వారానే సాధ్యమన్నారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లకు స్టవ్‌లు, విద్యార్థులకు విద్యా కిట్లను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమాల్లో కలెక్టర్ అరుణ్‌బాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోను గుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ సంస్థ డైరెక్టర్ సదా భార్గవి, రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్‌పర్సన్ మంజుల, ఆర్డీవో మధులత, టీడీపీ నాయకులు దారూనాయక్, కడియాల రమేష్, కొల్లి బ్రహ్మయ్య, పులిమి రామిరెడ్డి, బండారుపల్లి విశ్వేశ్వరరావు, మీరావలి, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేస్తూ..

స్పౌజ్ పింఛన్ల పంపిణీ వాయిదా

- మూడు జిల్లాల్లో 8,374 మందికి మంజూరు
- ఏడాది విజయోత్సవాలతో పింఛన్లకు అవాంతరం?

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ కోటాలో నూతనంగా ఎంపికైన వారికి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ వాయిదా పడింది. కూటమి కొలువు తీరిన జూన్ 12న అంటే గురువారం పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించిది. ఈ కార్యక్రమాల్లో ఎక్కడికక్కడ స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ కార్య క్రమాలకు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమం వాయిదా వేసినట్లు సమాచారం. 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందినవారి జీవిత భాగస్వాములకు పింఛను పొందే అవకాశం ప్రభుత్వం కల్పించింది. దీంతో ఈ కోటాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సం బంధించి 8,374 మంది అర్హత సాధించారు. గుంటూరు జిల్లా నుంచి 2,565 మంది, బాపట్ల జిల్లా నుంచి 2,715 మంది, పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా 3,094 మంది స్పౌజ్ కోటాలో కొత్తగా పింఛను పొందారు. వీరందరికీ త్వరలోనే పింఛన్లు అందజేస్తామని అధికారులు చెబుతున్నారు.

- పల్లెల్లో రైతుల సంబరాలు
- దుక్కిదున్ని సాగు పనుల ప్రారంభం
- ఏరువాక ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

వేడుకగా ఏరువాక



● గంగన్నపాలెంలో అరక తొలుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



● బొల్లవరంలో అరక తొలుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఏరువాక సాగారేరన్న అంటూ.. పల్లె కదిలింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా కుల, మతాలకు అతీతంగా ఏరువాక ఉత్సవంలో పల్లెల్లో సందడి నెలకొంది. బుధవారం జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఏరువాక ఉత్సవాలు జరిగాయి. కొన్ని గ్రామాల్లో తిరునాళ్లలో ఏరువాక సాగింది. రైతు కుటుంబాలతో కలిసి ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు అరక దున్ని సాగు పనులను ప్రారంభించారు. ఏరువాక ఉత్సవంతో పల్లెల్లో కోలాహలం నెలకొంది. ప్రత్యేకంగా ఎద్దులను, అరకలను అలంకరించి సంప్రదాయ దుస్తులతో రైతులు కుటుంబాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. ఎద్దులు, అరకలతో ప్రదక్షిణలు చేశారు. వినాయకస్వామికి ఉండ్రాళ్లు, పొంగళ్లు సమర్పించారు. తలపాగా చుట్టి, చంద్రకోలు చేతబట్టి అరకలతో పొలాలకు రైతన్నలు తరలివెళ్లారు. కోటి ఆశలతో భూ మాతకు నమస్కరించి సాగును ప్రారంభించారు. వినుకొండ నియోజకవర్గం ఈపూరులో ఏరువాక ఉత్సవంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళితో కలిసి పాల్గొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం గంగన్నపాలెంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అరక దున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం బొల్లవరంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాచర్ల నియోజకవర్గం అలుగురాజుపాలెంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట నియోజవర్గం పెట్లూరివారిపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అరకతో పొలం దున్నారు.



● అలుగురాజు పాలెంలో పొలం దున్నతున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి



ఈపూరులో దుక్కిదున్నుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన, జేడీఏ మురళి



● పెట్లూరివారిపాలెంలో పొలం దున్నుతున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
12 జూన్ 2025

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి....

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్ ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.


ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు.

- డాక్టర్ సుమతి, పిడియాట్రిషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం. పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి... మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి... తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు. ఇది దశాబ్దాల కిందటి కథ. మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి... తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది... మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి అపురూప సన్నివేశాలను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి... టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్, మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్లు రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్ తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగులుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కొవ్వై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

హనుమా

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో; చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటిఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి



డైవింగ్ సంచలనం

ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లిదండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లిదండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎఐడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, ఆప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో క్రైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగష్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెద్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



డీజీపీకి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు బుధవారం రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పల్నాడులో శాంతి భద్రతలు బాగుండటంతో పాటు గతంలో వున్న ఫ్యాక్షన్ పూర్తిగా తగ్గిపోవడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యరపతినేని హరీష్‌కుమార్ గుప్తాకు వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు తిరుపతి ప్రసాదాన్ని ఎమ్మెల్యే యరపతినేని అందజేశారు.

44,968 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 45,282 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,968 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,941 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13300	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	12700	334	9500	13800
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	10000	13000
4884	---	---	341	10000	14200
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	14600
షార్క్-1	10000	12000	బ్యాడిగి	10000	13500
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

ఏఎన్‌యూ అభివృద్ధికి సచ్చిదానందమూర్తి కృషి

ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ మధుమూర్తి

పెదకాకాని, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలు సామాజిక విలువలను పెంపొందించే తత్వ కేంద్రాలుగా విలసిల్లాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కొత్త మధుమూర్తి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిస్ట్ స్టడీస్ విభాగం వద్ద ఏర్పాటుచేసిన తత్వవేత్త, యూజీసీ మాజీ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రంలో చేసిన కృషి, ప్రపంచ దేశంలోని పరిశోధకులను కూడా ఆకర్షించిందని తెలిపారు. ఆయన విద్యారంగంలో విలువలను అభివృద్ధి చేయడానికి కృషి చేశారని, ఏఎన్‌యూ సర్వతోముఖాభివృద్ధికి సచ్చిదానందమూర్తి ఎనలేని సేవలందించారని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కే గంగాధర్‌రావు మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి కృషివలన ఏఎన్‌యూలో మహాయన బౌద్ధ అధ్యయన కేంద్రం, శాస్త్రీయ సామ్యవాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఆచార్య సురేష్‌కుమార్, ఆచార్య వీరయ్య, ఆచార్య పాల్ కుమార్, ఆచార్య సిద్దయ్య, డాక్టర్ డీ రవిశంకర్ రెడ్డి, ఆచార్య దివ్యతేజ



విగ్రహావిష్కరణ చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ కొత్త మధుమూర్తి

మూర్తి, ఆచార్య వీ వెంకటేశ్వర్లు, ఆచార్య రామచంద్రన్, ఆచార్య రవికుమార్, ఆచార్య ఆర్ శివరాం ప్రసా ద్, ఆచార్య పీ సుధాకర్, ఆచార్య వై అశోక్‌కుమార్, ఆచార్య సుబ్బారావు, ఆచార్య కే వెంకట్రావు, ఆచార్య తులసీదాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నాయుడు రాక

● దుగ్గిరాల రైతులకు జరిగిన నష్టంపై అధికారులతో సమీక్ష

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు గురువారం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన లాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం గుంటూరు నగరం చుట్టుగుంట సెంటర్‌లోని మార్కెటింగ్ కమిషనరేట్‌కు చేరుకొని దుగ్గిరాల ఏఎంసీ పరిధిలో గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో రైతులు నిల్వ చేసుకున్న పంట ఉత్పత్తులకు నష్టం జరిగింది. అయితే దీనికి సంబంధించి ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం బీమా కంపెనీల నుంచి విడుదల కాలేదు. ఈ అంశంపై ఆయన మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారని అధికారవర్గాలు ఈ సందర్భంగా తెలిపాయి.

నాటక రంగ అభివృద్ధికి సీఎం కృషి

● ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ



మాట్లాడుతున్న గుమ్మడి గోపాలకృష్ణ

తాడేపల్లి టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని ప్రాతూరులో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాటిక కళాపరిషత్ నూతన ఆఫీసును ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కళలు, కళాకారుల పట్ల ఎక్కువ మక్కువ ఉందని చెప్పారు. రెండోసారి నాటక అకాడమి చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఏపీలో నాటక వికాసానికి కళాకారులు రచయితలు, నటులు నటీమణులు, పరిషత్ నిర్వాహకులు దేవస్థాన కమిటీలు ఏపీలో నాటక పోషకులు ఎంత మంది ఉన్నారో వారందరి సహకారం చేతి కళాపోషకుల సహకారం తీసుకుని ముందుకు వెళతామన్నారు. నాటక రంగ అభివృదికి సీఎం చంద్రబాబు, మంత్రి కందుల దుర్గేష్ ఎంతో అండగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్రతో సంచలనం సృష్టించిన యువ నేత నారా లోకేశ్ తనను చంద్రబాబు నాయుడుకి పరిచయం చేశారన్నారు. ఈ ప్రాంతంలో లోకేశ్ క్రీడా ప్రాంగణం ఉందని, దీనిని కళా ప్రాంగణంగా మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అరవపల్లి శ్రీనివాస్, కోగంటి ప్రసాద్, పీ నాగేశ్వరరావు, కే సత్యనారాయణ, వంశీ, హరిబాబు, నరసింహారావు, రంగనాయకులు, సాంబశివరావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మిర్చి నాణ్యతని దెబ్బతీసే పురుగుమందులను నిషేధించాలి

● చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతల విజ్ఞప్తి

గుంటూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు ఎగుమతి అయ్యే మిర్చి నాణ్యత ప్రమాణాలు ఏ విధంగా ఉండాలనే వివరాలను ఆయా దేశాల నుంచి కేంద్ర ప్రభుత్వం తెప్పించుకోవాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేన్ నేతలు కోరారు. అలానే పురుగు మందుల అవశేషాలు మోతాదుకు మించి ఉన్న వాటిని వివిధ దేశాలు తిరస్కరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ అవశేషాలు కలిగిన పురుగుమందులను రైతులు వినియోగించు కుండా నిషేదించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంటూరు మిర్చియార్డు ఆవరణలోని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశంలో చర్చించిన వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, జనరల్ సెక్రెటరీ తోట రామకృష్ణ మీడియాకు వివరించారు. చైనా, అమెరికా, యూరప్ ఖండం దేశాలు ఎలాంటి నాణ్యత ప్రమాణాలు కోరుకొంటున్నాయో తెలుసుకొని వాటిపై స్పైసెస్‌బోర్డు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. దాని వలన ఎగుమతుల తిరస్కరణలు అనేవి లేకుండా ఉంటాయని చెప్పారు. అప్పుడు రైతుకు, ట్రేడర్‌కు మేలు జరుగుతుందన్నారు.

ఎగుమతులు పెరిగినా ధర ఎందుకు పెరగలేదంటే...

చైనా దేశానికి ఏటా 2 లక్షల టన్నుల మిర్చి ఎగుమతి జరుగుతుంటుందని సాంబశివరావు, రామకృష్ణ తెలిపారు. అయితే ఈ సంవత్సరం 3 లక్షల టన్నులు ఎగుమతి అయిందన్నారు. ఇందుకు కారణం చైనాలోని రెండు ప్రావిన్స్‌ల లో ప్రతికూల పరిస్థితులేనని చెప్పారు. ఒక ప్రావిన్స్ లో మిర్చి విస్తీర్ణాన్ని పూర్తిగా తగ్గించేయగా, రెండో ప్రావిన్స్‌లో ప్రకృతి విపత్తులు కారణంగా నష్టం వాటిల్లిందన్నారు. ఈ కారణంగా ఎగుమతులు పెరిగాయేత ప్పా మార్కెట్ ధర పెరగలేదన్నారు. వాస్తవానికి మిర్చి ధర ఎక్కువగా ఉంటేనే తమకు సులభంగా టర్నోవర్ పూర్తి అయి లాభాలు వస్తాయన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నేతలు

వర్షాలు కురిసి.. పంటలు బాగా పండాలి

● వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ) జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవి ద్యాలయం వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. బుధవారం లాంఫాంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని సాంప్రదాయ బద్ధంగా విత్తనాలు నాటి జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా విచ్చేసిన వీసీ శారద జయలక్ష్మీదేవి మాట్లాడుతూ వర్షాలు సకాలంలో కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ, డాక్టర్ బీ శ్రీలక్ష్మీ, డాక్టర్ బీవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఏ మణి, డాక్టర్ డీ సంపత్‌కుమార్, డాక్టర్ జీ కరుణసాగర్, డాక్టర్ ఏవీ రమణ, డాక్టర్ కే రాధిక, సహపరిశోధన సంచాలకులు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమిలో పాల్గొన్న వీసీ శారద జయలక్ష్మీదేవి, అధికారులు

హత్యకేసులో నిందితుడి అరెస్టు

బాపట్లరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెం ఎస్సీకాలనీలో భార్యపై పెట్రోల్ పోసి హత్యకు పాల్పడిన వ్యక్తిని బుధవారం బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపిన వివరాలు ప్రకారం చెరువుజమ్ములపాలెం ఎస్సీ కాలనీకి చెందిన సుభాషిణి అనే మహిళను అదే గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తి సుమారు 12 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు తారక్, సాత్విక్‌లు ఉన్నారు. హరీష్ ఆటోడ్రైవర్‌గా, మృతురాలు సుభాషిణి కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవారు. ఇటీవల మృతురాలు సుభాషిణి పేరుమీద రేషన్ డీలర్ షిప్ వచ్చింది. నిందితుడు హరీష్ చాలా కాలం నుంచి సుభాషిణిని మానసికంగా, శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. ఆవిషయాలను ఆమె తల్లి వైపు వారికి చెప్పకుండా భరించేది. ఇదిలా ఉండగా సుభాషిణి మీద అనుమానం పెంచుకున్న హరీష్ ఈ నెల 9వ తేదీన ఆమెతో గొడవపడి మధ్యాహ్నం 12 గంటల సమయంలో మంచం మీద పడుకొని వున్న భార్య మీద పెట్రోలు పోసి నిప్పు అంటించాడు. దాంతో సుభాషిణి కేకలు వేసుకుంటూ బయటకొచ్చి పడిపోవటంతో స్థానికులు మంటలను ఆర్పి వేశారు. హరీష్ పారిపోయాడు. అనంతరం గ్రామస్తులు అంబులెన్స్ ద్వారా గాయపడిన సుభాషిణిని తొలుత బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినది. మృతురాలి తల్లి మేరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుధవారం సాయంత్రం నిందితుడిని అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు.



నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

దేశ సంపదను గుజరాత్‌కు దోచి పెడుతున్న మోదీ

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ

బెల్లంకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దేశ సంపదను తన మిత్రులైన అంబానీ, గుజరాత్ పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బైరాపట్నం రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, రామాంజనేయపురం గ్రామాల్లో సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం రామకృష్ణ మాట్లాడారు. కేంద్రంలో మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చి పేద, బడుగు, బలహీన వర్గాల, కార్మిక, కర్షక ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. యువతకు రూ.2 కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యువతకు మోదీ మోసం చేశారని ఆరోపించారు. కార్మిక హక్కులను కార్పొరేట్ పెట్టుబడి దారులకు దాసోహం అయ్యేలా చట్టాల్లో మార్పుచేయటానికి చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి వెంకటరావు, రామాంజనేయులు, శ్రీనివాసరావు, కుంభా వెంకటరావు, రామకృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

● తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు

మాచవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు రైతులు గుర్తింపు కార్డులు కొరకు గ్రామ సచివాలయాల్లో అర్జీలు పెట్టుకోవాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా కౌలు రైతుల గుర్తింపు కార్డుల కొరకు సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల రైతులు పొలం యజమాని పాసు పుస్తకం జిరాక్స్, కౌలు రైతు ఫోటో, ఆధార్ కార్డు వీఆర్‌వోలకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి కే రామమ్మ, డీటీ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

6200 మిరప టిక్కీల అమ్మకం

దాచేపల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 6,900 మిరప టిక్కీలు రాగా 6200 టిక్కీలు అమ్మకం జరిగాయి. 334 రకం కాయలు రూ 8వేలు నుంచి రూ 12,500, తేజా రకం రూ 9వేలు నుంచి రూ 14వేలకు, తాలు మిరపకాయలు రూ 2వేలు నుంచి రూ 7వేల వరకు అమ్మకాలు జరిగాయి.

నేడు పాఠశాలల పునఃప్రారంభం

పిడుగురాళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గురువారం నుండి పాఠశాలల గంటలు మోగనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావలసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పది రోజుల క్రితమే విద్యాశాఖ కార్యాలయానికి చేరుకోగా వాటిని జాబితాల ప్రకారం ఆయా పాఠశాలలకు చేరిపోయాయి. వేసవి సెలవుల అనంతరం పునఃప్రారంభం కానున్న పాఠశాలలను ఉపాధ్యాయులు, సిబ్బంది శుభ్రంచేయించే పనిలో నిమగ్నమయ్యారు.

● ముప్పాళ్ళ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వపాఠశాలలు గురువారం నుండి పునఃప్రారంభం అవుతాయని ఎంఈఓ-2 సీతారామిరెడ్డి బుధవారం తెలిపారు.

● అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరం గురువారం నుండి ప్రారంభం కానుండడంతో పాఠశాలల్లో స్వీపర్లు పాఠశాలను శుభ్రం చేసేపనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఉపాధ్యాయులు కూడా బదిలీలు జరిగి కొత్త పాఠశాలల్లో విద్యార్థులతో పాటు చేరనున్నారు. విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాలు, నోట్స్‌లు పాఠశాలలకు చేరాయి.

నేడు కూటమి నేతల సంబరాలు

పిడుగురాళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం అన్ని మండల కేంద్రాలలో నేతలు సంబరాలు జరుపుకోనున్నారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అన్ని మండల, గ్రామాలలో నేతలు సంబరాలు జరుపనున్నారు.

ఆదర్శ రైతు నరసింహారావుకు సన్మానం

పిడుగురాళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు రైతులకు ఆరోగ్యకరమైన పంటలను అందిస్తున్న ఆదర్శ రైతు కొత్తగణేశునిపాడుకు చెందిన పొందూరి నరసింహారావు అభినందనీయుడని గ్రామ వికాససమితి పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ఆయనను సన్మానించారు. స్థానిక సాయి వృద్ధాశ్రమ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కొత్తగణేశునిపాడుకు చెందిన పొందూరి, రెడ్డి నాయుడు, ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతు రేళ్ల కోటేశ్వరరావు, నాగభూషణం, చల్లగుండ్ల విశ్వనాథం, ప్రసాద్ గురూజీ, చల్లగుండ్ల చిన్న, సాంబశివరావు, డీ ఏడుకొండలు, వెంకటరెడ్డి, అంబటి గురువులు, ఆత్మకూరి లక్ష్మీనరసింహమూర్తి, ముప్పాళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్లలో ఉచిత వైద్య శిబిరం

మాచవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లుట్ల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పిడుగురాళ్ళ ఉన్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో డాక్టర్ ఎం వెంకటరామిరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి స్థానిక కూటమి నేతలు సహకరించారు.

తొలి రోజే విద్యార్థి మిత్ర..

సత్తెనపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 12వ తేదీన పాఠశాలలు ప్రారంభం కానున్న రోజునే విద్యార్థులకు విద్యార్థి మిత్ర కానుక కిట్లు ఇవ్వనున్నట్టు ఎంఈవో శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కానుక కిట్లు మండల కేంద్రానికి చేరుకున్నాయన్నారు. బడి పునఃప్రారంభించిన రోజే ప్రతి విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు, బెల్టు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ఏకరూప దుస్తులను సరికొత్త రంగుల్లో అందించనున్నట్లు తెలిపారు.

సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలి

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్ల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికతను రైతులు అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అలుగురాజుపల్లిలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులతో కలిసి పొలంలో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించి మాట్లాడారు. అన్నదాతల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చిందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఖరీఫ్ సీజన్ నుంచే రైతులకు విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు అందజేస్తూ సాగుకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు వ్యవసాయంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ ఖర్చులను తగ్గించుకొనే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే అన్నారు. పెస్టిసైడ్ వాడకాలను సాధ్యమైనంత మేర తగ్గించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత జూలకంటి అక్కిరెడ్డి, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, జల్లెల కొండలు, సుధాకర్‌రెడ్డి, గుండాల శ్రీను, విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఆడెపు కోటయ్య పాల్గొన్నారు.

సీడ్ ఏపీతో యువతకు వెన్నుదన్ను

మాచర్లటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, స్వయం ఉపాధి అంశాలపై సీడ్ ఏపీ అందిస్తున్న నైపుణ్య శిక్షణ యువతకు వెన్నుదన్నుగా నిలుస్తోం



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో సీడ్ ఏపీ ద్వారా నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాపులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన్ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యాన యువతకు వివిధ రంగాలపై నైపుణ్య శిక్షణనిచ్చి ఉపాధి మార్గాలను చూపుతోందన్నారు. అనంతరం వ్యవసాయం, అనుబంధ రంగాలు, చిన్న తరహా పరిశ్రమల స్థాపన, సంస్థలను నెలకొల్పేందుకు అనుకూలమైన శిక్షణ, సంబంధిత అనుమతి పత్రాలు, బ్యాంకు రుణాలు వంటి అనేక అంశాలను వర్క్‌షాపులో పాల్గొన్న నిపుణులు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్, కంభంపాటి అనిల్, వజ్రం నాయక్, కజ్జం సైదయ్య, రాజబోయిన మధు యాదవ్, కొమెర శివ, బూసాని వేణుగోపాల్‌వర్మ, సీడ్ ఏపీ స్టేట్ మిషన్ మేనేజర్ లక్ష్మీదేవి, సెంచ్యూరీయన్ యూనివర్సిటీ డాక్టర్ సాయిరాం, ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్పీ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

పొగాకు రైతులను ఆదుకోండి

● దిశా సమావేశంలో ఎమ్మెల్యే

నియోజకవర్గంలో పెద్దఎత్తున నిలిచిపోయిన పొగాకు నిల్వలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జిల్లా మార్కెటింగ్ శాఖాధికారులను కోరారు. బుధవారం నరసరావుపేలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యాన జరిగిన దిశా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కావాల్సిన నిధులు, ఖరీఫ్‌లో రైతులకు అందించాల్సిన ఎరువులు, విత్తనాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే నకిలీ బీటీ పత్తి విత్తనాలు అమ్మే అక్రమార్కులపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు.

కారంపూడిలో ఏరువాక..

కారంపూడి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి వేడుకలను బుధవారం కారంపూడిలో వైభవంగా నిర్వహించారు. అరకలు కట్టి పొలాల వద్ద పొంగళ్ల నైవేద్యం పెట్టారు. అనంతరం పొలాల్లో దుక్కి దున్ని తొలి పంటకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. వేపకంపల్లిలో, పెదకొదమగుండ్ల, కాకానివారిపాలెం, ఒప్పిచర్ల, ఇనుపరాజుపల్లిలో ఏరువాక పౌర్ణమి వేడుకలు జరిగాయి.

రైతు ఇంట సిరుల పంట పండాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



ముప్పాళ్ల: ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న ఎమ్మెల్యే కన్నా



మాచవరం: గంగిరెడ్డిపాలెంలో దుక్కి దున్నుతున్న ఏవో కే రామమ్మ తదితరులు

ముప్పాళ్ళ, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రైతుల ఇంట సిరులు పండాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బొల్లవరం గ్రామంలో బుధవారం ఎద్దులతో అరక దున్ని వ్యవసాయ పనులను ప్రారంభించి రైతులకు ఎమ్మెల్యే ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ట్రాక్టర్‌తో కూడా పంటపొలాన్ని దున్నారు. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు గోగినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ కళ్ళం విజయభాస్కరరెడ్డి, రావిపాటి నానయ్య, గనుపల్లి చంద్రహాస్, అబ్దుల్ మజీద్, అత్తోట ఈశ్వరరావు, కోట వీరయ్య, గుత్తా రామారావు, రావెళ్ళ మదుబాబు పాల్గొన్నారు.

వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని అచ్చంపేట రోడ్డులో బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైతులంతా సుఖసంతోషాలతో సాగులో నిమగ్నం కావాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఉన్నారు.

గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి

నకరికల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బుధవారం రైతులు పొలం దున్ని ఏరువాక పౌర్ణమిని ప్రారంభించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు.

● మాచవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలు రైతులు, వ్యవసాయశాఖ అధికారులు ఘనంగా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కే రామమ్మ గంగిరెడ్డిపాలెం గ్రామంలో జరిగిన ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొని దుక్కి దున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు అరకలను అలంకరించుకొని పొలాల్లో దుక్కులు దున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకుంది.

● పిడుగురాళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వైశాఖ మాస ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకొని చినఅగ్రహారం గ్రామంలో ఉన్న శ్రీగంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామికి దేవాలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జాము నుండి రుద్రాభిషేకం, పార్వతిదేవికి మహా స్నపన, కుంకుమార్చన, దూపదీప నివేదన, నిరాజన మంత్రపుష్పార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుంకలగుంటలో విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్

● అదనపు చార్జీలు వసూలుపై ఆగ్రహం

నకరికల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంట గ్రామంలో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి విద్యుత్ మీటరు లేని ఇళ్ళను గుర్తించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారి సర్వీసులను తొలగించారు. పెండింగ్ విద్యుత్ బిల్లుల వసూళ్ళను చేపట్టారు. గత నెల కంటే ఈ నెలలో రూ.300 అంతకు పైగా ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్‌బిల్లులు వసూలుచేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజుకు పదినుంచి 15 సార్లు కోతలు విధిస్తున్నారని నిలదీశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అంతరాయాన్ని నివారించాలని, విద్యుదీకరణ పనులను పూర్తిచేయాలన్నారు. లేదంటే సబ్ స్టేషన్ ముట్టడిస్తామని గ్రామస్తులు అన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం

నకరికల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నకరికల్లులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామికి చెందిన 49 సర్వే నెంబరులో గల 3.15 ఎకరాలకు ఈ నెల 13వ తేదీ నరసరావుపేటలోని అంకమ్మ తల్లి దేవస్థాన కార్యాలయం వద్ద కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు ఈవో వై వెంకయ్య తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఫుట్‌బాల్ శిక్షణ పూర్తి

సత్తెనపల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సుగాలీ కాలనీ జడ్పీ హైస్కూల్లో ఏప్రిల్ 26 నుంచి క్రీడాకారులకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమం బుధవారంతో ముగిసింది. 40మంది బాలికలు, 50మంది బాలురు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణపొందిన బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాలుర విభాగంలో మాదల జట్టు ప్రథమ, సత్తెనపల్లి జట్టు ద్వితీయస్థానం, బాలికల విభాగంలో సత్తెనపల్లి జట్టు ప్రథమ, మాదల జట్టు ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కే సుబ్రహ్మణ్యం, పీఈటీలు నాగిరెడ్డి, అచ్చిరెడ్డి, రియాజ్, మస్తాన్‌వలి, శ్రీరామిరెడ్డి, జనసేన నేతలు రంగిశెట్టి సుమన్, కొత్త రామకృష్ణ, గౌస్, నాగిరెడ్డి బహుమతులు అందించారు.

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పరామర్శ

మాచర్ల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పునూరుకు చెందిన టీడీపీ సీనియర్ నేత గుండాల శ్రీను మాతృమూర్తి గుండాల రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకొని మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు.

మలేరియా సబ్ యూనిట్‌ను సందర్శించిన జిల్లా మలేరియా అధికారి

మాచర్ల రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల నివారణలో భాగంగా పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్‌ను బుధవారం జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ సందర్శించారు. పల్నాడు ప్రాంతాల్లోని చెంచుగూడెంలలో ప్రతి ఇంటికి మలాథీయన్ స్ప్రే చేయాలని సూచించారు. నూతన హెల్త్ అసిస్టెంట్లకు ఐఆర్ఎస్ ప్రోగ్రాంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, బాషా, హెల్త్ అసిస్టెంట్లు మురళీధర్, బాలయ్య, వాగ్యానాయక్, శ్రీనివాసరావు, సద్గురుబాబు, శ్రీనివాసరావు, హెన్రిబాబు, దానం తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం: బీజేపీ నేతలు

దుర్గి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అందరం కలిసికట్టుగా పర్యావరణాన్ని కాపాడుకుందామని బీజేపీ నేతలు అన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక గ్రంథాలయ ప్రాంగణంలో బుధవారం వారు మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాశం మట్టారెడ్డి, వెలిదండి శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కా సీతారామయ్య, తుపాకుల కోటేశ్వరరావు, తక్కెళ్లపాటి కోటేశ్వరరావు, కప్పెర లక్ష్మి, వెలిదండి మంగారావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కారంపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ నయోమ తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 512.20 అడుగులు ఉంది. ఇది 135.43 టీఎంసీలకు సమానం. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 3528 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోవాటర్‌గా 4428 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రజల మన్ననలు పొందిన కూటమి ప్రభుత్వం

కారంపూడి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన యేడాది కాలంలోనే ప్రజల మన్ననలు పొందిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూసా రామాంజినేయులు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చేరువైందన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ఉన్నం లక్ష్మీనారాయణ, కటికల బాలకృష్ణ, బొమ్మిన శేషగిరి, గోళ్ల సురేష్ యాదవ్, బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, తండా మస్తాన్ జాని, కర్నా సైదారావు, లింగాల శ్రీనివాసరావు, బీజేపీ నేతలు పువ్వాడ శ్రీనివాస్, కజ్జం పెదఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు క్రోసూరులో కూటమి ప్రభుత్వ వేడుకలు

క్రోసూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద గురువారం వేడుకలు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. అచ్చంపేట, క్రోసూరు మండలాల కార్యకర్తలందరూ హాజరుకావాలని కోరారు. అమరావతి, పెదకూరపాడు, బెల్లంకొండ మండల కేంద్రాల్లో కూడా వేడుకలు జరుగుతాయన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

అమరావతి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తైన సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో కాటూరి మెడికల్ కళాశాల సహకారంతో ఈనెల 13వ తేదీ స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, ఆప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, జనరల్ సర్జన్‌కు సంబంధించిన వైద్యసేవలు అందించనున్నారు. క్యాంపునకు వచ్చేవారు తమ ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబరు తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

మాచర్లటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కౌన్సిల్ హాలులో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

రెంటచింతల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్న సందర్భంగా గురువారం రెంటచింతలలోని టీడీపీ ఆఫీసులో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటలకు విజయోత్సవ ర్యాలీ వుంటుందన్నారు.

కుట్టు మిషన్ అందజేత

అచ్చంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి):అచ్చంపేటలోని స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామానికి చెందిన నిరుపేద టైలర్ షేక్‌బాబుకు ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ చేతులమీదుగా కుట్టు మిషన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా రమేష్, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పింఛన్ల పథకం ద్వారా నెలకు రూ.2,720 కోట్లు అందిస్తుందన్నారు. దీపం పథకం ద్వారా కోటి గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసిందన్నారు. మహిళల రక్షణకు శక్తి టీమ్స్, లక్ష మంది మహిళలకు కుట్టు మిషన్లు, 11 వస్తువులతో ఎన్‌టీఆర్ బేబీ కిట్లు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రజల అభిమానం, ఆశీర్వాదమే కూటమి ప్రభుత్వానికి బలమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషితో రాష్ట్రం స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు వేస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయకుమార్

గృహ వినియోగదారులకు సోలార్ విద్యుత్ ఉపయోగకరం

● జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయకుమార్

బెల్లంకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగకరమని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ పత్తిపాటి విజయకుమార్ అన్నారు. ఏపీసీడీసీఎల్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బెల్లంకొండ మండలంలోని పీఎం సూర్యఘర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ విజయకుమార్ మాట్లాడుతూ గృహాలపై విద్యుత్ సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే చార్జీలు తగ్గుతాయన్నారు. సోలార్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క వినియోగదారుడు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు.కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నూతలపాటి సింగయ్య, బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్, నందిరాజుపాలెం సర్పంచ్ శివారెడ్డి, టీడీపీ నాయకుడు హుస్సేన్, దుర్గారావు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఆకులగణపవరంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నా

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం

రాజుపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం గ్రామంలో తహసీల్దార్ కార్యాలయం నుండి న్యూ సచివాలయం వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. తొలుత టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నాను పలువురు ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఆకుల గణపవరంలోని ఎస్సీ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన కమ్యూనిటి హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు పులిబండ్ల సాంబశివరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య, డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, పల్లపాటి పెద్దిరాజు, మర్రి వెంకట్రామిరెడ్డి, మొరసా శ్రీను, షేక్ అల్లాబక్షు, వాసా వేంకటేశ్వర్లు, అంకాళ్ల ప్రభుదాసు, సర్పంచ్‌లు పసుపులేటి వెంకటస్వామి, కణదం శ్రీను, పేతురు, పులిబండ్ల అశోక్, వడ్డెంపూడి వెంకట్రావు, పెమ్మా అంకమ్మరావు, నాయకులు గంగవరపు రామలక్ష్మణరావు, సానికొమ్ము కోటిరెడ్డి, పెద్దింటి శ్రీను తదితరులు ఉన్నారు

ఒత్తిడి రహిత జీవితానికి యోగా ఆయుధం

క్రోసూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఒత్తిడి రహిత జీవితానికి యోగా ప్రధాన ఆయుధమని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ అన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఊటుకూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి సాంబశివరావు, సీహెచ్‌వో సయ్యద్ మాబూ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఊటుకూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

16న జాబ్‌మేళా

మాచర్లటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యాన జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు, ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్యలు మాట్లాడుతూ పట్టణంలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యనభ్యసించి 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయసు వారు జాబ్‌మేళాకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 78427 47682, 7702921219, 9100566581లను సంప్రదించాలన్నారు.

జిల్లా పౌరసరఫరాల అధికారిగా ఎంవీ ప్రసాద్



నరసరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పౌరసరఫరాల అధికారిగా ఎంవీ ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా పౌర సరఫరాల సహాయ అధికారి విధులు నిర్వహిస్తున్న ఎంవీ ప్రసాద్ పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. పల్నాడు జిల్లా పౌర సరఫరాల అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి.నారదముని వద్ద నుంచి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, కార్యాలయ సిబ్బంది ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

తొలిరోజు 350 మందికి బదిలీలు

గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక సమస్యలతో మంగళవారం నిలిచిపోయిన ఎస్జీటీల కౌన్సెలింగ్ బుధవారం ఎట్టకేలకు జరిగింది. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో తొలిరోజు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీలకు కౌన్సెలింగ్ చేపట్టారు. ఒకటో నంబరు నుంచి 750 నెంబరు వరకు కౌన్సెలింగ్ చేపట్టారు. రాత్రి పొద్దుపోయే వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. రాత్రి 9 గంటల వరకు 350 మందికిపైగా కౌన్సెలింగ్ నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు డీఈవోలు రేణుక, చంద్రకళ, జేడీ శైలజ, పరిశీలకులు లక్ష్మీకుమారి, సహాయ సంచాలకులు శైలజబాయి, ఆర్.రమణ, తదితరులు పాల్గొన్నారు

14 నుంచి బస్‌పాస్‌ల మంజూరు: డీపీటీవో మధు

నరసరావుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బస్‌పాస్‌లు 14వ తేదీ నుంచి ఇవ్వనున్నట్లు డీపీటీవో ఎం.మధు బుధవారం తెలిపారు. స్టూడెంట్ బస్‌పాస్‌లు, ఐడీ కార్డుల కలర్స్ మార్చటం, వాటి డేటాను సిస్టంలో పొందుపరచవలసిన అవసరం ఉందని అందువల్ల బస్‌పాస్‌లను శనివారం అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ వివరాలను సైట్‌లో నమోదు చేసి, మొబైల్ నెంబర్‌కు వచ్చే పిన్‌ను బస్టాండ్‌లోని బస్ పాస్ కౌంటర్‌లో తెలియజేస్తే పాస్ త్వరగా ఇవ్వటానికి అవకాశం ఉందన్నారు.

ఎట్టకేలకు బియ్యం సరఫరా

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

మతుకుమల్లి (శావల్యాపురం) జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మతుకుమల్లిలోని రేషన్ షాపునెంబర్ 19కి ప్రభుత్వం మంజూరుచేసిన 45 క్వింటాళ్ల బియ్యాన్ని సివిల్ సప్లయ్స్ అధికారులు సరఫరా చేయకపోవడంతో రేషన్ పంపిణీ నిలిచిపోయింది. దీనిపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిన రేషన్ పంపిణీ' అనే కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు వెంటనే రేషన్ షాపునకు 45 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేశారు. సమస్యను పరిష్కరించడంలో చొరవ చూపిన ఉన్నతాధికారులకు, ఆంధ్రజ్యోతి దినపత్రికకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



అప్పాపురంలో జరిగిన కోదండ రామస్వామి, సీతమ్మవారి కల్యాణం

ముగిసిన సప్తాహం

నాదెండ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాపురంలో 49రోజులుగా జరుగుతున్న సప్తాహం బుధవారంతో ముగిసింది. గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రామ సంకీర్తన సప్తాహం కార్యక్రమాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆఖరిరోజున మహా పూర్ణకుంభం కార్యక్రమం చేశారు. కోదండ రామస్వామి, సీతమ్మ అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు గొట్టిపాటి రామారావు, నల్లూరి సుబ్బారావు, బిక్షవతి, సరస్వతి, నీల, రమాదేవి, రాణి, వెంకటరత్నం, వెంకటరమణ పర్యవేక్షించారు.

క్లుప్తంగా...

● రొంపిచర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, మునమాక సెక్టార్ల సూపర్‌వైజర్లు బదిలీ అయ్యారు. రొంపిచర్ల సూపర్‌వైజర్ శశిదేవి బాపట్లకు, మునమాక సెక్టార్ సూపర్‌వైజర్ దేవిబాయి వినుకొండకు బదిలీ అయ్యారు.

● వినుకొండ: పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల సేవాసంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని పండరీపురంలో ఉన్న బీఆర్ఐజీ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా గేరా నాగేశ్వరరావు కొత్తగా నియమితులయ్యారు. ఇక్కడ హెచ్ఎంగా ఉన్న రమణరావు నరసరావుపేట ప్రకాష్ నగర్‌లో ఉన్న తిలక్ మున్సిపల్ హైస్కూల్‌కు బదిలీ అయ్యారు.

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పల్నాడు కలెక్టరేట్‌లో జూన్ 16న మెగా లోన్ మేళా, అవగాహన సదస్సు జరుగుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

● నరసరావుపేట టౌన్: అమరావతి మహిళలపై వైసీపీ అనుచిత వ్యాఖ్యలు యావత్ మహిళా జాతికే అవమానంఅని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. విధ్వంసాన్ని సృష్టించడం, అరాచకాన్ని ప్రోత్సహించడం సిగ్గు ఎగ్గు లేకుండా మహిళలపై అఘాయిత్యాలను చేసేవారిని పరామర్శించడం జగన్ మోహన్ రెడ్డి నైజం అన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేస్తున్న చీఫ్‌విప్ జీవీ, అధికారులు

ఈపూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధి సాధించేలా కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తోందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులో బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను అన్నదాతలతో కలిసి జీవీ జరుపుకున్నారు. అరక దున్ని పొలం పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో చీఫ్ విప్ జీవీ మాట్లాడుతూ నదులు అనుసంధానం చేసి రైతులు రెండు పంటలు పండించేందుకు సాగునీరు అందించి దేశంలోనే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అందరికీ ఆదర్శంగా నిలవనున్నారన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టులు పూర్తిచేయడం వలన లక్షల ఎకరాలు పంటలతో కళకళలాడనున్నాయన్నారు.అదేవిధంగా ప్రకృతి వ్యవసాయం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రాయితీపై అన్నదాతలకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నామన్నారు. రైతు ఆర్థికంగా బలపడితే స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించవచ్చునన్నారు. గత ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందన్నారు. ధాన్యం కొనుగోలుచేసి వారికి డబ్బులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత 1650 కోట్లు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయడం జరిగిందన్నారు. అనంతరం రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఇ మురళి, డీపీఎం అమలకుమారి ఏడీఏ రవిబాబు, ఏవో రామారావు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, పెమ్మసాని నాగేశ్వరరావు, అయినాల కోటేశ్వరరావు, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, బెల్లంకొండ సైదులు, అబ్బూరి శ్రీనివాసరావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు, నర్రా కిశోర్, చాపల మల్లయ్య, బొల్లా సుబ్బారావు, నెల్లూరి శివరామయ్య, వజ్జా సత్యనారాయణ, చింతకాయల వెంకట్రామయ్య, కూరాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గంగన్నపాలెంలో రైతులతో కలిసి ఏరువాకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

గంగన్నపాలెంలో...

చిలకలూరిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు ఆత్మహత్యల్లో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన జగన్, వారికి మేలుచేశాననడం పచ్చి అబద్ధమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం అన్నారు. చిలకలూరిపేట మండలం గంగన్నపాలెంలో ఏరువాక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులతో కలిసి ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన వైసీపీ హయాంలో రైతుల ధాన్యం బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందనే వాస్తవాన్ని జగన్ విస్మరిస్తే ఎలా అని ప్రశ్నించారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో జగన్ రాజకీయ ప్రసంగాలు చేస్తూ, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించాడని విమర్శించారు. అనంతరం గ్రామంలో రూ.8లక్షల వ్యయంతో కొత్తగా వేసిన సీసీరోడ్లు, డ్రెయిన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, జవ్వాజి మదన్ మోహన్, గుర్రం నాగపూర్ణ చంద్రరావు, గట్టినేని రమేష్ పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ మండలంలో...

నరసరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మండలం యలమందల, పెట్లూరివారిపాలెంలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యలమందలలో రైతులందరూ అరక ఎద్దులను, ట్రాక్టర్లను గ్రామంలోని వినాయకస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పొలాల్లో వ్యవసాయం ప్రారంభించారు. పెట్లూరివారిపాలెంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఏరువాక పౌర్ణమిలో పాల్గొని అరక చేతపట్టి రైతులతో కలసి ఉత్సాహంగా వ్యవసాయ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో ఏరువాక ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కోటేశ్వరరావు



స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

చిలకలూరిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా ఉన్నత స్థానాల్లో ఉన్న వారు ఎలాంటి ఆదరువులేని నిరుపేదలను ఆదుకోవాలని, సీఎం ప్రవేశపెట్టిన పీ-4లో పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం కోరారు. పట్టణంలోని పండరీపురంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ ఆధ్వర్యంలో ఒయాసిస్ సేవా సంస్థ వారు 10వ తరగతిలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్ షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సంస్థసేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ సంస్థ సభ్యురాలైన దివంగత కారుమంచి సరళాదేవి జ్ఞాపకార్థం ఆమె భర్త శివరావు రూ.లక్ష స్కాలర్‌షిప్‌ల నిమిత్తం అందచేశారని తెలిపారు. మొత్తం 20మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున అందచేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, కోలా విజయలక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

యడ్లపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. యడ్లపాడు మండలం వంకాయలపాడులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం ప్రారంభించారు. ఎంజీఆర్‌జీఎస్ నిధులు రూ.16లక్షలతో నిర్మించిన పనుల శిలాఫలకాన్ని స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం గ్రామాభివృద్ధిలో భాగంగా చేపట్టాల్సిన పనుల గురించి గ్రామస్థులతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలో బుధవారం శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు బస్‌షెల్టర్లు, వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్ నిర్మాణ పనులకు జీవీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలోనే వినుకొండను ఆధునిక పట్టణంగా, గ్రేటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారంతో రూ.210కోట్ల నిధులు తీసుకొచ్చామని త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. మురుగునీ శుద్ధికి రూ.18కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. పట్టణాన్ని పరిశుభ్రత, పచ్చదనంతో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోష్, నాగశ్రీను రాయల్, పత్తిపూర్ణ, షకీలా, పెమ్మసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం: జీవీ

ఈపూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బాలికా విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ఈపూరు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సమగ్ర శిక్ష నిధులు 159.50 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వసతిగృహం నిర్మాణం కోసం బుధవారం భూమిపూజ చేశారు. ఈసందర్భంగా జీవీ మాట్లాడుతూ బాలికల విద్య కోసం మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, అయినాల కోటేశ్వరరావు, కేజీబీవీ ఛైర్మన్ కొలగాని వెంకయ్య, ప్రత్యేకాధికారి జ్యోతి, పెమ్మసాని నాగేశ్వరరావు, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, గోపు వీరాంజినేయులు, కాసరగడ్డ మల్లికార్జునరావు, నర్రా కిశోర్, మీసాల ప్రసాదు, బందెల కన్నయ్య, కూరాకుల శ్రీనివాసరావు, జాగర్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం అంటేనే టీడీపీకి పేటెంట్ అన్నారు. పెన్షన్ రూ.3వేలు నుంచి రూ.4 వేలకు పెంచి నెలకు రూ 2720 కోట్లు, ఏడాదికి రూ.34వేల కోట్లు ఇప్పటికే పంపిణీ చేసిందన్నారు. 13347 డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఎన్నికల హామీలో ఇచ్చిన తొలి సంతకం హామీని నెరవేర్చిందన్నారు. దీపం-2 కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇచ్చి ఇప్పటికే కోటి సిలిండర్లులు పంపిణీ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్‌యాక్ట్ రద్దు చేసిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1200 కోట్లు ఖర్చుచేసి రాష్ట్రవ్యాప్తంగా 20వేల కిలోమీటర్లు రోడ్లను బాగు చేయడం జరిగిందన్నారు. శ్రీ సిటీలో రూ 5 వేల కోట్లతో ఎల్జీ పరిశ్రమ ఏర్పాటు, రూ65 వేల కోట్లతో రిలయన్స్ బయో గ్యాస్‌ప్లాంట్ ఏర్పాటు, అమరావతికి కేంద్రం ద్వారా రూ 15 వేల కోట్ల ఆర్థిక సహాయం, పోలవరం ప్రాజెక్టు కోసం కేంద్రప్రభుత్వం రూ 12, 500 కోట్ల నిధుల విడుదల చేయడం జరిగిందని చెప్పారు. విశాఖ రైల్వే జోన్‌సాధించి పనులు ప్రారంభించారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, అందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అన్ని ప్రాంతాలకు సమానంగా అభివృద్ధి సంక్షేమ ఫలాలను అందిస్తోందని వివరించారు.

ఏడాదిలో చిలకలూరిపేటను ఎంతో అభివృద్ధి చేశాం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



కేంద్రమంత్రి పెమ్మసాని, ఎంపీ లావుతో కలిసి టెక్స్‌టైల్ పార్కును పరిశీలిస్తున్న ప్రత్తిపాటి (ఫైల్)

చిలకలూరిపేట, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలోని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వివరించారు. కూటమి ఏడాది పాలనపై బుధవారం ఆంధ్రజ్యోతితో పుల్లారావు మాట్లాడుతూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు మంచి పరిహారం ఇప్పించామన్నారు. రూ.900 కోట్లతో నిర్మించిన బైపాస్ రోడ్డు ప్రారంభం కావడంతో చిలకలూరిపేట రూపురేఖలు మారిపోయాయని, పట్టణంలో ట్రాఫిక్ సమస్య తొలగి, రోడ్డు ప్రమాదాలు తగ్గిపోయాయన్నారు. బైపాస్ రోడ్డు చిలకలూరిపేటకు మణిహారంగా ఉందన్నారు. నియోజకవర్గం పరిధిలో రూ.181కోట్లు వివిధ రకాల పెన్షన్లను అందించామన్నారు. ప్రపంచ వారసత్వ పర్యాటక కేంద్రంగా కొండవీడును గుర్తించి అభివృద్ధి చేయాలని ఢిల్లీలో కేంద్ర మంత్రి షెకావత్‌ను ఎంపీతో కలిసి విజ్ఞప్తి చేశామని, దేశవ్యాప్తంగా అభివృద్ధి చేయబోతున్న 50పర్యాటక ప్రదేశాల్లో కొండవీడును కూడా చేరుస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రూ.360కోట్ల స్వయం ఉపాధి రుణాలు పంపిణీచేసి చిలకలూరిపేటను జిల్లాలో అగ్రస్థానంలో నిలిపామన్నారు. నియోజకవర్గంలో 400మందికి రూ.4.25 కోట్లు సీఎం సహాయనిధి చెక్కులు అందించామని, అత్యవసర చికిత్సల నిమిత్తం మరో 57మంది రోగులకు రూ.1.85కోట్ల విలువైన ఎల్‌వోసీలు అందించామన్నారు. నర్సరీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యాబోధన కోసం రూ.29కోట్లతో 49 గదులతో శాశ్వత భవనాలను నిర్మించి ఇర్లపాడులో కేంద్రీయ విద్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. అమృత్ పథకం కింద పట్టణంలోని తాగునీటి అవసరాలకు రూ.116.80కోట్లు మంజూరు చేయించామని, ఈ నిధులతో సాగర్ కాల్వ నుంచి నేరుగా చిలకలూరిపేట చెరువుల వద్దకు 38 కిలోమీటర్ల పొడవున భూగర్భ పైపులైన్లు వేయబోతున్నట్టు తెలిపారు. డంపింగ్ యార్డ్‌లో రూ.16కోట్ల వ్యయంతో నిర్మించిన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని కొత్తగా ప్రారంభించినట్టు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో పట్టణంలో రోడ్లు, కాల్వల నిర్మాణం చేపట్టబోతున్నట్టు చెప్పారు. చిలకలూరిపేట టెక్స్‌టైల్ పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంలో భాగంగా రూ.5 కోట్లతో నిర్మించిన ప్లాంటు ద్వారా నియోజకవర్గంలోని 15 గ్రామాలు, పట్టణంలోని 10వార్డుల ప్రజల కోసం తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేశామని చెప్పారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సమగ్ర అభివృద్ధి కోసం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించామని, పట్టణంలో మూడు అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయించి, వాటి నిర్వహణకు ఈ ఏడాదిలో రూ.40లక్షల వరకు వెచ్చించామని తెలిపారు. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.9 కోట్లకు పైగా వ్యయంతో అభివృద్ధి పనులు, రూ.12 కోట్లతో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం జరిపామన్నారు. ఇమామ్, మౌజమ్‌ల గౌరవ వేతనాలకు రూ.39లక్షలు, పాస్టర్ల గౌరవ వేతనాలకు రూ.14లక్షలు వెచ్చించడం జరిగిందని వివరించారు. టిడ్కో గృహాల కాలనీలో రూ.42 లక్షలతో అభివృద్ధి పనులు చేయించినట్టు తెలిపారు. విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ.1.53 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. రైతుల అభ్యర్థన మేరకు కొత్త విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు రూ.50 లక్షలు ఖర్చు చేసినట్టు తెలిపారు.



ఎన్టీఆర్ సుజల స్రవంతి ప్లాంటును ప్రారంభించిన ప్రత్తిపాటి (ఫైల్)

వర్షంతో 'యోగాంధ్ర' రద్దు

● నిరాశతో వెనుదిరిగిన ప్రజలు, అధికారులు

యడ్లపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): చారిత్రక కొండవీడుకోటలో బుధవారం జరగాల్సిన యోగాంధ్ర కార్యక్రమం వర్షం కారణంగా రద్దయింది. కొండవీడుకోట ఘాట్ రోడ్డు ప్రారంభంలో చెక్‌పోస్టు వద్ద ఉదయం 6గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, ఎంపీలు హాజరుకావాల్సి ఉంది. అయితే తెల్లవారు జాము నుంచి వర్షం పడుతుండడంతో అధికారులు కార్యక్రమాన్ని రద్దుచేశారు. ఉదయాన్నే అక్కడకు చేరుకున్న అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనుకున్న సమయానికి వర్షం కురుస్తుండడంతోపాటు, కార్యక్రమం సజావుగా సాగేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో అటవీ, రెవెన్యూ అధికారులు విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనితో జిల్లా కలెక్టర్ సూచన మేరకు అధికారులు కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. యోగా ప్రాధాన్యతపై విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21వరకు నెల రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ పర్యాటక కేంద్రాలు, చారిత్రక ప్రాంతాల్లో యోగా ప్రచారాన్ని కొనసాగిస్తోంది. దీనిలో భాగంగా కొండవీడుకోట వేదికగా బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. అయితే వర్షం కారణంగా కార్యక్రమం రద్దు కావడంతో అక్కడకు చేరుకున్న అధికారులు, ప్రజలు నిరాశ చెందారు. ఎంతో శ్రమతో వేసిన వేదిక, మ్యాట్‌లను తొలగించి లారీలలోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు.


రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం డిమాండ్ చేశారు. మండలంలోని రొంపిచర్లలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆయన భూమికి పూజలు నిర్వహించి అరక దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఏడాది పూర్తయినా ఇంతవరకు నగదు చెల్లించ లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు పండించిన పంటలను కొనుగోలు చేశామన్నారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేశామన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పడాల చక్రారెడ్డి, అన్నెం పున్నారెడ్డి, కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పొనుగోటి వెంకటరావు, మోతుకూరి వెంకటేష్ చౌదరి, పచ్చవ రవీంద్రబాబు, గెల్లి చిన కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ- సర్వే పనుల్లో రైతులను నొప్పించొద్దు: జేసీ

నరసరావుపేట కల్చరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే పనులలో రైతులతో సక్రమంగా మాట్లాడాలని, వారిని నొప్పించొద్దని రెవెన్యూ అధికారులకు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సూచించారు. బుధవారం జిల్లాలో సర్వే పనులు జరుగుతున్న మండలాల రెవెన్యూ అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రీ-సర్వేలో తలెత్తుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దారులు, డీటీ, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.



లింగంగుంట్ల అగ్రహారం ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

లింగంగుంట్ల భూములకు పరిష్కారం

నరసరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న లింగంగుంట్ల భూముల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కారానికి ముందడుగులు వేసింది. యాజమాన్యమైన పుష్పగిరి పీఠాధిపతులకు, రైతులకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందుబాబు పలు దఫాలుగా చర్చించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. కలెక్టర్ అరుణ్‌బాబు చొరవతో పీఠాధిపతులకు.. రైతులు రూ.1,90,600 నగదును చెల్లించారు. వందల సంఖ్యలో ఈ భూములపై ఆధారపడుతున్న రైతు కుటుంబాలకు పూర్తిస్థాయి ఉపశమనం లభించనుంది. బుధవారం కలెక్టరేట్‌లో పీఠాధిపతులకు ఎంపీ, పల్నాడు జిల్లాలోని శాసనసభ్యులు, ఇతర నాయకులు చెక్కును అందించారు.

ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి: ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను ఫీల్డ్‌అసిస్టెంట్‌లు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఒక్కో గ్రామపంచాయతీకి 10ఎకరాలు చొప్పున మొత్తం 150 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని, ఈ నెల 26వ తేదీకల్లా అంచనాలు సిద్ధంచేసి ప్రభుత్వ అనుమతుల కోసం పంపాలన్నారు. ఏపీవో కె.రామారావు, బీఎఫ్‌టీ లావణ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: సంజీవ్ కుమార్

నరసరావుపేట రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నివారణకు రవాణా శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందని జిల్లా రవాణాశాఖ అధికారి సంజీవ్ కుమార్ తెలిపారు. బుధవారం పోలీసు, రవాణాశాఖ, ఆర్టీసీ అధికారులు చిలకలూరిపేటలో 45వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వారినుంచి రూ.49480 అపరాధ రుసుము వసూలు చేసినట్లు తెలిపారు. తనిఖీలలో చిలకలూరిపేట ఆర్టీసీ డీఎం, సీఐ, ఎస్ఐ, రవాణా శాఖ అధికారి సురేష్‌బాబు పాల్గొన్నారు.